# సన్మానం మీకే

'సన్మానం మాకా' ఆ ఆడిటోరియంలో కూర్చున్న అందరూ ఎవరికి వాళ్ళు ఆశ్చర్యంగా అనుకొంటున్నారు. ఆ సన్మానం ఏర్పాటు చేసింది ప్రముఖ సినిమా రచయిత శివరాం. ఆహ్వానితులు ఆ కాంప్లెక్సులోని అతని ఫ్లాట్ చుట్టుపక్కల ఉన్నవారు. వాళ్ళెవరూ సినిమాకు సంబంధించిన వాళ్లుకాదు. ఆసన్మాన సభకు ఒక ప్రముఖ నిర్మాత అధ్యక్షుడు కాగా, మరో ప్రసిద్ధ దర్శకుడు ముఖ్య అతిథి. ఆహ్వాన పత్రికలో 'సన్మానం మీకే' అన్న హెడ్డింగుతో ముఖ్య అతిథిపేరు, అధ్యక్షులవారి పేరు ఉంది. క్రింద సన్మానకర్తగా తన పేరు వేసుకుని వున్నాడు సినిమా రచయిత శివరాం. సన్మానితులెవరో ఎవరి పేరూ అందులో లేదు.

అంతేగాక ఆడిటోరియం బయట కూడా 'సన్మానం మీకే' అన్న పెద్ద బ్యానర్ కట్టించాడు. కానీ సన్మానితులెవరనేది ఇంకా సస్పెన్సుగానే వుంది. వేదికకు ఒకవైపు టేబులు మీద తొంభైతొమ్మిది వెండి షీల్డులు అందంగా అలంకరించబడి వున్నాయి. వాటి ప్రక్కన పట్టుచీరల, పట్టుపంచెల ప్యాకెట్లు పేర్చి వున్నాయి. కార్యక్రమం ప్రారంభం కాగానే వాటిని అందివ్వడానికి గాను ఆ టేబులుకు అటూ ఇటూ రచయిత అసిస్టెంట్లు ఇద్దరు నిలబడి ఉన్నారు.

సన్మాన కార్యక్రమానికి సమయం ఆసన్నమైంది గాని ప్రసిద్ధ వ్యక్తులెవరూ కనిపించలేదు. వేదిక మీద కూర్చున్న అధ్యక్షుల వారు, నిర్మాతగారు తప్ప. మరి ఆ షీల్డులు అందుకునేదెవరు?

ఇదేమీ ఆషామాషీ వ్యవహారం కాదు. సన్మానం చేసేది ప్రముఖ రచయిత, సినీ సామ్రాజ్యాన్ని తన గ్లామర్ రచనలతో నిర్మాతలకు కాసుల వర్షం కురిపించే శివరాం. ఆయన సినిమాలన్నీ శతదినోత్సవాలు, రజతోత్సవాలు, వజ్రోత్సవాలు జరుపుకున్నాయి. ఆయన కథలంటే సినిమా ఇంద్రస్ట్రీలో యమ క్రేజ్. సినిమా రచయితలకొక ప్రతిష్ట తెచ్చిన ఏకైక వ్యక్తి.

స్టేజీ మీద ఉచితాసనాల మీద కూర్చున్న నిర్మాతగారికి, దర్శకుల వారికి కూడా అర్థం కావడం లేదు, ఎవరికి సన్మానం చేయాలో. అదే విషయం ఇద్దరూ చాలాసేపట్నుంచి చెవులు కొరుకుంటున్నారు. హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్న శివరాం ఒకసారి వాచీ చూసుకుని తన శ్రీమతితో సహా స్టేజీ మీద తమ కోసం ఖాళీగా ఎదురుచూస్తున్న ఆసనాలలో కూర్చున్నారు. కార్యక్రమాన్ని ఇక ప్రారంభించదన్నట్లు తన ప్రక్కనే ఉన్న అధ్యక్షులవారికి సైగ చేశారు.

అధ్యక్షులవారు లేచి, కొద్దిసేపు శివరాం ప్రతిభను గురించి మాట్లాడి, 'శివరాంగారు తాను ఇంత మంచి కథలు అందించడానికి కారణభూతులయిన వారికి ఈ సన్మానం

ఏర్పాటు చేశారని, ఆ సన్మాన గ్రహీతలెవరో తనకు తెలియదనీ, శివరాం గారిమీద అభిమానంతో ఈ కార్యక్రమానికి హాజరయ్యానని' చెప్పి రపీమని కూర్చున్నాడు.

తరువాత ముఖ్య అతిథిగారు లేచి, ఇదే చెప్పేసరికి ప్రేక్షకుల్లో అలజడి ప్రారంభమైంది. సన్మానం ఎవరికో చెప్పాల్సిందంటూ కేకలు వేశారు.

రచయిత శివరాం మైకు దగ్గరకు వచ్చి, ఆడియన్స్‌ని చూస్తూ "సన్మానం మరెవరికో కాదు. మీకే. ఒకొక్కరికి వెండిషీల్డు, పట్టుబట్టలు" అన్నాడు.

అంతే..... అప్పటి వరకూ రణగొణధ్వనులతో ఉన్న ఆడిటోరియం కాస్తా నిశ్శబ్దమైపోయింది. ఎవరికి వాళ్ళు రచయిత అంతగొప్ప వాడు కావడానికి తామెలా కారణభూతయ్యారో అర్థంగా సతమతమయిపోయారు. వాళ్ల ముఖాల్లో అర్థంకాని సస్పెన్సుతో కూడిన ఆనందం కనిపిస్తూ వుంది.

రచయిత శివరాం తన ఉపన్యాసం కొనసాగిస్తూ "అవును, ఇది పచ్చి నిజం. నా విజయాలకు కారణం మీరే. ఎలా కారణమయ్యారో నాకొక్కడికే తెలుసు. పోస్టుగ్రాడ్యుయేషన్ చదువు పూర్తయిన తరువాత సినిమాలకు కథలు రాద్దామని భాగ్యనగరానికివచ్చాను. వచ్చిన కొత్తల్లో చాలా ఇబ్బందులు పడ్డాను. అసిస్టెంటు డైరక్టరుగా భుక్తి గడుపుకొంటూ ఎన్నో కథలు రాసి, ఎందరో నిర్మాతలకు వినిపించాను. నా సబ్జెక్టులు ఎవరికీ నచ్చలేదు. అలాంటి పరిస్థితుల్లో ఒకరోజు బ్రహ్మచారినైన నేను వంట చేసుకోవడానికి కూరగాయల మార్కెట్‌కి వచ్చాను. ఇప్పటి మా అత్తగారు, ఆనాడు నాకేమీ కాని చెంగమ్మగారు ఆ రోజు మార్కెట్‌లోనే వున్నారు." ఆగి ఊపిరి పీల్చుకున్నాడు.

"...నేను టమోటాలు కేజీ పదిహేను రూపాయిలకు, వంకాయలు పన్నెండు రూపాయిలకు, బెండకాయలు పది రూపాయిలకు కొని, బీరకాయలు బేరం చేస్తుండగా అదే కొట్టుకు వచ్చిన చెంగమ్మగారు తన వాక్చాతుర్యంతో, మైమరపు మాటలతో, మధ్యమధ్యలో పిట్ట కథలతో నవ్వుతూ, నవ్విస్తూ అదే కూరగాయల్ని సగానికి సగం ధరకు అంటే టమోటాలు ఏడున్నర రూపాయలకు, వంకాయలు ఆరు రూపాయలకు, బెండకాయలు ఐదు రూపాయలకు కొంది. బిత్తర పోయి చూస్తున్న నన్ను ఏధరకు కొన్నావని అడిగి, ఆమె కొన్న ధరకే నాకూ కూరగాయలు లెక్క కట్టించి, కొట్టు వాడిచేత నాకు మిగతా బాలెన్సు డబ్బులు కూడా ఇప్పించింది. ఆమె వాక్చాతుర్యానికి మురిసిపోయి నేను ఆమెకు థాంక్స్ చెప్పాను. చెంగమ్మగారు నా చరిత్రంతా విని, "నాయనా నిన్ను చూస్తే బుద్ధిమంతుడిలా వున్నావు. ఎందుకు చేయి కాల్చుకుంటావు. నా యింట్లో పేయింగ్ గెస్ట్‌గా వుండు" అంది. నేను సరేనని ఆమె ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా చేరాను. గది కూడా ఇచ్చింది.

భర్తపోయాక ఆయనకొచ్చిన ఫ్లాట్‌లో వుంటూ, పెన్షను పెట్టుకొని తింటూ, కూతుర్ని చదివించుకుంటూ ఉంది చెంగమ్మ. అంతేగాక అదే కాంప్లెక్సులో అయిదంతస్తుల్లో వున్న

యాబై ఫ్లాట్ల వారికీ వడియాలు, అప్పడాలు, పచ్చళ్ళు అమ్ముకొంటూ అందరికీ తలలో నాలుకగా మెలుగుతూ, వాళ్ల కష్టాలు వింటూ, వాళ్ల సుఖసంతోషాలలో పాలుపంచుకొంటూ, అవసరాలకు ఆదుకొంటూ జీవిస్తూ వుంది. ఆమెగారే నా విజయాలకు మూలకారణమని సవినయంగా మనవి చేసుకుంటున్నాను" అంటూ ప్రేక్షకులలో ముందు వరుసలో కూర్చున్న చెంగమ్మ గారికి రెండు చేతులెత్తి నమస్కారం చేసాడు రచయిత శివరాం.

చెంగమ్మగారు సర్వాంతర్యామి అయిన విష్ణువులా ఫోజుపెట్టి ఆనందంగా నోట్లోని కిళ్ళీని నములుతూనే తన కూర్చున్నచోటు నుంచే చేయెత్తి శివరాంని ఆశీర్వదించింది.

"చెంగమ్మ గారు నాకు భోజనం పెడుతూ ఒక్కో ఫ్లాట్‌లోని గొడవల్ని తన వాక్చాతుర్యంతో వినసొంపుగా వివరంగా చెప్పేది. నేనూ ఓపిగ్గా వినేవాడిని. నా ఉత్సాహం చూసి ఆమె ఇంకా ఉత్సాహంగా ఒక్కో కుటుంబంలోని సమస్యల్ని వర్ణించి వర్ణించి మరీ చెప్పేది. అవే నా సినిమా కథలకు మూలమయ్యాయి. ఒక కుటుంబంలోని భార్యా భర్తల తగాదాలను, అంతలోనే అన్నీ మరిచిపోయి ప్రేమించుకునే వాళ్ళ అనుబంధం ఇతివృత్తంగా 'సంసారంలో సంగీతం' అన్న కథరాసి ఒక నిర్మాతకు చూపించాను. 'అబ్బో సూపర్ సెంటిమెంట్‌తో కూడిన లవ్వు' అంటూ హక్కులు తీసుకొని అదే పేరుతో దాన్ని సినిమా తీసాడు. హండ్రెడ్ డేస్ ఆడింది. ఇప్పుడు సదరు సినిమాలకు మూలకథలు అందించిన భార్యాభర్తలు దామవరపు సుబ్బయ్య, వెంకమ్మలను స్టేజీమీదకు వచ్చి షీల్డు అందుకోవలసిందిగా కోరుతున్నాను" అంటూ ఆహ్వానించాడు శివరాం.

ప్రేక్షకుల్లో రెండవ వరుసలో కూర్చొని వున్న సదరు దంపతులు ఆనందంగానూ, ఆశ్చర్యంగానూ స్టేజీమీదకు వచ్చారు. ఒక పెద్దరచయిత తమ పొరుగువాళ్ళని ఇలా సన్మానించడం వాళ్ళకు ఆశ్చర్యంగా వుంది. శివరాం సుబ్బయ్య మెడలో బంతిపూల మాల వేస్తే, శివరాం భార్య కళ్యాణి వెంకమ్మ మెడలో గులాబీమాల వేసింది. రచయిత అసిస్టెంటుల్లో ఒకరు షీల్డు పట్టుకుని రాగా, మరొకాయన పళ్ళెంలో పండ్లు, పట్టుబట్టలు పట్టుకొని వచ్చాడు. నిర్మాతగారు షీల్డును, దర్శకుల వారు పట్టుబట్టలను సుబ్బయ్య దంపతులుకు బహుకరించారు. ప్రేక్షకులు కరతాళ ధ్వనులు చేసారు.

తరువాత మైకు దగ్గరకొచ్చి శివరాం, 'నా మొదటి కథ ఇలా విజయవంతం కావడంతో వెంటనే మరో నలుగురు సినిమా నిర్మాతల నుంచి కథలకు ఆఫర్ వచ్చింది. కాని కథలెలా? మళ్ళీ చెంగమ్మ గారిని ఆశ్రయించినాను. ఎనిమిదో నెంబరు ఫ్లాట్‌లోని భార్యభర్తల వింత ప్రవర్తన గురించి చిలవలు పలవులుగా చెప్పింది. భర్త వంట సరిగా చేయలేదని, భార్య చేతిలో దెబ్బలు తిని తలుపు తీసుకుని బయటకు వచ్చిన ఆమె భర్త, బాధను తనలోనే దాచిపెట్టి, తానే భార్యను కొట్టినట్లు ఫోజుపెట్టి తల పైకెగరేసి క్రాపు వెనక్కు నెట్టుకుని "దీని పిచ్చి అణిచా. నాతో పెట్టుకుంటుందా. ఉఫ్" అంటూ ఆయాసపడడం

చేసే వాడు. దీన్నే 'వంట రూములో నలుడు-బయటి రూములో బలుడు' అన్న పేరుతో ఒక కామెడీ కథను రాసాను. వీరంద్రప్రసాద్ నటించిన ఈ సినిమా కామెడీ సినిమాలకు ఒరవడి అయి ఎన్నో సెంటర్లలో శతదినోత్సవాలు చేసుకొంది. దానికి కారణభూతులయిన నెల్లూరు నాంచారయ్య, ప్రభావతి దంపతులను వేదికమీదికి ఆహ్వానిస్తున్నాను" అన్నాడు.

ప్రేక్షకుల్లో నుంచి లేచివచ్చిన నెల్లూరు నాంచారయ్య ప్రభావతి దంపతులను యధారీతి పూలదండలు వేసి, షీల్డు, పట్టుబట్టలతో సత్కరించాడు.

"ఉన్న విషయం చెప్పాను. ఏమనుకోకండి" అని నాంచారయ్యతో అన్నాడు శివరాం చిన్నగా.

"మీరు భలేవాళ్ళే. అది మాకథ అని మీరిప్పుడు చెప్పేంతవరకు మాకు తెలియదు. ఆ సినిమాను నేనూ నాభార్య పాతికసార్లు చూసి అందులోని హాస్యాన్ని ఎంజాయ్ చేసామండీ" అన్నాడు నాంచారయ్య.

'హమ్మయ్య' అంటూ గుండెల మీద చేతులుంచుకున్నాడు రచయిత శివరాం.

"అయ్యా! అలా నా రెండవ కథ సూపర్‌హిట్ కాగానే ఇకనేను ఒక నిర్ణయానికి వచ్చాను. నా కథల ఖజానా చెంగమ్మ గారు. చెంగమ్మ గారు చెప్పిన వాస్తవ సంఘటనల ఆధారంగా రాసిన కథలు హిట్లమీద హిట్లు కొడుతున్నాయి. ఇక చెంగమ్మగారిని వదల దలుచుకోలేదు. అందుకే ఆమె కుమార్తె కళ్యాణితో పెళ్ళికి ప్రపోజలు పెట్టాను. మగదిక్కులేని చెంగమ్మగారూ "నీలాంటి కుర్రాడు మా అమ్మాయికి తగిన వరుడు నాయనా" అంటూ వెంటనే పెళ్ళికి అంగీకరించింది. పెళ్ళికాగానే నాకు కథల పంట పండింది. చెంగమ్మగారు, వడియాలు, అప్పడాలు, పచ్చళ్ళు ఫ్లాటు ఫ్లాటు తిరిగి అమ్ముతూ వాళ్ళకు తీపి మాటలు చెబుతూ ప్రతి ఫ్లాట్‌లోని అత్యంత రహస్యాలు కూడా తేనెటీగ తొండంతో మకరందాన్ని లాగినట్లు వాళ్ళగుట్టమట్టులన్నీ, తన వాక్చాతుర్యంతో లాగేది. వాటిని ఎంతో ఓపిగ్గా కథకు పనికొచ్చే విధంగా మలుచుకొనేవాడిని. అలాంటిదే మూడవ కథ.

గ్రౌండ్ ఫ్లోరులో ఉన్న అనూరాధ, ఫోర్తు ఫ్లోరులో ఉన్న అమర్‌నాథ్ ప్రేమించు కున్నారు. వారి ప్రేమ ఫలించలేదు. అప్పుడు వారి ప్రేమకు సంధానకర్తలుగా మూడవ ఫ్లోరులో ఉన్న పరంధామయ్య దంపతులు ఉండి ఆ ప్రేమ పెళ్ళి జరిపించారు. ఆ స్ఫూర్తితో నేను రాసిన టీనేజ్ లవ్‌స్టోరీ, 'మా పెళ్ళికి మీరే పెద్దలు' సినిమా కథ. ఆ సినిమా ఎంత సంచలనం కలిగించిందో మీకందరికి తెలిసిందే. ఎందరో టీనేజ్ యువకుల్ని ఆకట్టుకొని, శతదినోత్సవాలు, రజతోత్సవాలు, స్వర్ణోత్సవాలు జరుపుకొని సినిమా పరిశ్రమలో కలెక్షన్లలో నేటికీ ఎవర్‌గ్రీన్ సినిమా అయింది. అందుకే ఇప్పుడు దగదర్తి పరంధామయ్య, వారి శ్రీమతి అయిన మీనాక్షమ్మగారలను వేదికమీదికి వచ్చి సన్మానం స్వీకరించమని కోరుతున్నాను" అన్నాడు శివరాం.

చిరునవ్వుల చిందిస్తూ వేదిక మీదకు వచ్చిన వృద్ధదంపతులయిన పరంధామయ్యను, మీనాక్షమ్మను ఘనంగా సన్మానించాడు శివరాం. తమ షీల్డు, పట్టుబట్టలు తీసుకొని వాళ్ళు స్టేజీ దిగగానే, పరంధామయ్య దంపతులు ప్రేమ పెళ్లి జరిపించిన అనూరాధ, అమర్‌నాథ్‌లను వేదిక మీదకి ఆహ్వానించాడు.

స్టేజీ మీదికొచ్చిన వాళ్ళిద్దరిని ప్రేక్షకులకు చూపిస్తూ "వీళ్ళిద్దరూ ప్రేమ పెళ్ళి చేసుకొని తమ తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళగా రెండు కుటుంబాల వాళ్లూ వీళ్లని బహిష్కరించారు. దాంతో వాళ్లు పరంధామయ్య ఫ్లాట్‌లో ఒక ఇరుకు గదిలో కాపురం పెట్టారు. ఆ ఇరుకు గదిలో వాళ్ళ ఇబ్బందులు, సరసాలు, సరదాలు మా అత్తగారు చెప్పగా దాన్ని 'ఇరుకు గదిలో ఇల్లరికపుటల్లుడు' అనే పేరుతో ఒక కామెడీ కథ రాసాను. ఆ కామెడీ సినిమా యాభై సెంటర్లలో వందరోజులు ఆడడమేకాకుండా, 'బి' సెంటర్లలో కూడా శతదినోత్సవం చేసుకుంది. దాని రియల్ హీరో, హీరోయిన్లయిన వీళ్ళిద్దరికీ ఇప్పుడు సన్మానం" అంటూ ఎనౌన్సు చేశాడు శివరాం.

ఇలా రచయిత ఒకొక్క జంటను పిలవడం, వాళ్ల వాస్తవకథను తను ఏవిధంగా సినిమా కథగా మార్చింది, అది ఏ పేరుతో సినిమాగా రిలీజయి ఎంత ఘన విజయం సాధించింది చెప్పడం, తరువాత వాళ్లకు సన్మానం చేయడం జరిగిపోతూ వుంది. సన్మానం పొందిన వాళ్లు తమ చేతుల్లోని షీల్డులను మురిపెంగా తడుముకోవడం, పట్టుచీర, పట్టుపంచెలవైపు చూసుకోవడం చేస్తున్నారు. శివరాం మంచి తనాన్ని గురించి చెప్పుకుంటున్నారు.

ఇంకా సన్మానం పొందనివారు, తమ జీవిత కథ, రచయిత చేతిలో ఏ విజయవంతమైన చిత్రంగా మారిందోనని చెవులు కొరుక్కుంటున్నారు. మరో గంటన్నరకు అందరినీ సన్మానించడం జరిగింది. టేబుల్‌మీదున్న తొంభైతొమ్మిది వెండి షీల్డులు, పట్టుపంచెలు, పట్టుచీరల ప్యాకెట్లు ప్రెజెంట్ చేయబడ్డాయి.

"ఇప్పటికీ నావి తొంభై తొమ్మిది సినిమాలు రిలీజయి విజయం సాధించాయి. నా నూరవ సినిమా పేరు 'ఇంట్లో యజమాని–ఇంటెనుక వీర ప్రేమికుడు'. దాని షూటింగు రేపు ప్రారంభమవుతుంది. ఈ సినిమాకు బేస్ అంకమ్మ కథ. అంకమ్మ పనిమనిషి. అన్ని ఫ్లాట్‌లలోనూ పనిచేస్తుంది. ఒక ఫ్లాటు యజమాని భార్యకు తెలియకుండా తనింట్లో పనిచేసే అంకమ్మకు ప్రేమలేఖలు రాస్తున్నాడని, ఏం చేయాలోతోచడం లేదని ఆమెనాకు చెప్పగా నేనీకథని తయారు చేసాను. ఆ ఫ్లాటు యజమాని పేరు నేను చెప్పను. ఇకనైనా ఆ ఫ్లాటు యజమాని ఈ సినిమా చూస్తే మాత్రం ఇలాంటిఅలవాటు మానుకుంటాడు. సినిమా ఇంకా తియ్యలేదు కాబట్టి అంకమ్మకు షీల్డులుకాని, పట్టుబట్టలు కానిపెట్టడం లేదు. కాని ఆమెకు ఒక గోల్డ్‌చైన్ ప్రెజంట్ చేస్తున్నాను. అంకమ్మా వేదిక మీదికి వచ్చి గోల్డ్ చెయిన్ తీసుకుపోమ్మా" పిలిచాడు రచయిత శివరాం జేబులోంచి గోల్డ్‌చెయినున్న ప్యాకెట్ తీసి.

సదరు అంకమ్మ సిగ్గుల మొగ్గవుతూ వేదిక మీదికి వచ్చి ఆ ప్యాకెట్ అందుకొని అందరికీ నమస్కారం పెట్టి, ప్రేక్షకుల్లో తనకు ప్రేమలేఖలు రాసిన ఫ్లాటు యజమాని వైపు క్రీగంట చూసి క్రిందకి దిగింది.

తరువాత శివరాం మైకు దగ్గరకు వచ్చి "ఈ పదేళ్ళలో నేనింత గొప్ప రచయితను కావడానికి దోహదం చేసిన మీ అందరికీ నా స్థాయికి తగట్లు సన్మానించి నా కృతజ్ఞతలు తెలియజేసుకున్నాను. అయితే మీ కథలన్నీ నాకు అందించిన మీడియేటరయిన మా అత్తయ్య చెంగమ్మగారిని నేను ప్రత్యేకంగా సన్మానించుకోవాలి. అది 'న భూతో నభవిష్యతి'గా వుండాలి" అన్నాడు.

సభలో కరతాళధ్వనులు మోగాయి. రచయిత సైగనందుకుని మహారాజ సింహాసనం లాంటి కుర్చీని వేదిక మీదికి తెచ్చారు. దానిమీద పువ్వులు చల్లారు. రచయిత వేదిక దిగి గౌరవంగా చెంగమ్మగారిని ఆహ్వానించి ఆమెను తోడ్కొని వచ్చి మహారాజు సింహాసనం మీద ఆమెను అధిష్ఠింపచేశాడు. కళ్యాణి గులాబి మాల వేయగా, నిర్మాత గారు బొకే అందించారు. దర్శకులవారు ఆమెకు కాశ్మీరు శాలువా కప్పారు. వజ్రాల కిరీటం ఆమె తలపై ధరింపజేశాడు రచయిత శివరాం.

శివరాం తిరిగి మైకు దగ్గరకొచ్చి, 'మా అత్తయ్య చెంగమ్మ గారి పుణ్యాన పదికోట్ల రూపాయలు సంపాదించాను. ఇటీవలే బంజారాహిల్స్‌లో బిల్డింగు కట్టుకున్నాను. దానికి కృతజ్ఞతా పూర్వకంగా 'చెంగమ్మ నివాస్' అని పేరు పెట్టుకున్నాను. ఆమెకీ సందర్భంగా కొత్తకారు ప్రెజెంట్ చేస్తున్నాను" అంటూ సభాముఖంగా చెంగమ్మ గారికి కారు తాళాలు అందించాడు.

"ఈ హైదరాబాదు, సికింద్రాబాదు జంటనగరాలు ఎంతో విశాలమైనవి. ఫ్లోటింగు పాపులేషను కూడా ఎక్కువ. మా అత్తయ్యగారు ఈ కొత్తకారులో ఈ జంటనగరాలలో తిరుగుతూ ఎప్పటికప్పుడు కొత్తకొత్తవాళ్ళతో పరిచయాలు చేసుకుని వాళ్ళ జీవితచరిత్రలు సేకరించి కొత్తకొత్త సంఘటనలు వినిపించాలని, అవి నా కొత్త సినిమా కథలకు ప్రేరణ కావాలని కోరుకుంటున్నాను."

రచయిత మాటలు పూర్తి కాగానే మళ్ళీ చప్పట్లు మారు మ్రోగాయి.

సినిమా కథారచయితగా తిరుగులేని విజయాలను సాధిస్తున్న రచయిత శివరాం ఇతివృత్తాలను సేకరించే నూతన విధానం తెలుసుకొన్న స్టేజీమీదున్న దర్శక, నిర్మాతలు నోరెళ్ళబెట్టారు ✷

*(ఆంధ్రభూమి వీక్లీ, తేది 26-9-2002)*